2

# పాఠశాల

ఆరోజు కూడా ఆఫీసు నుంచి యింటికి రాగానే అదే దృశ్యం కనిపించింది మళ్ళీ.

పిల్లలు గుంపుగా ఆ మూలకు చేరి తదేకంగా కళ్ళనిండా ఉత్సుకతను నింపుకుని చూస్తున్నారు. పిచ్చుకలు ఎగురుతూ కొత్తగా కట్టుకుంటున్న గూడులో ఓ క్షణం సేపు కూర్చుంటూ.... మళ్ళీ ఎగురుతూ కిచకిచ చప్పుళ్ళతో కితకితలు పెడుతున్నాయి. పిల్లలకు వాటిని చూస్తూ ఆనందపడడం వ్యాపకమైపోతోంది.

ప్రక్కనే ఖాళీ కుర్చీలలో బోర్లించిన పుస్తకాలున్నాయి.

నాల్గయిదు రోజులనుంచి వరుసగా చూస్తున్నాను నేను ఈ తతంగాన్ని.

ఇదివరకు నేను ఆఫీసునుంచి యింటికొచ్చేవరకు ముగ్గురు పిల్లలూ బడినుంచి వచ్చేసి చక్కగా కాళ్లూ చేతులూ కడుక్కుని బుద్ధిగా చదువుకుంటూ కనిపించే వాళ్ళు. చదువుపైన వాళ్ళు కనబరుస్తున్న శ్రద్ధను చూచి ఆనందించేవాడిని.

కాని.... దాదాపు ఓ వారం క్రితం... ఎక్కడినుంచి వచ్చాయో రెండు పిచ్చుకలు.... ముందు గదిలో ఓ మూలనున్న వెంటిలేటర్ గూట్లో చేరి ముక్కులతో గడ్డిపోచలను చేరవేయడం ప్రారంభించేయి. మొదటిరోజు ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు నేను. మరునాడు పిల్లలు బడినుంచి రాగానే పుస్తకాలనెక్కడో పారేసి పిచ్చుకల వెంట పడ్డారు. అవి ఎగరడం.... వీళ్ళు కేరింతలు కొట్టడం.... ఇంటి నిండా ఎండు గడ్డిపరకలు పడి.... మా ఆవిడ ఊద్వలేక విసుక్కోవడం.. ఈ గోల మొదలైంది. సాయంకాలం పిల్లలు చదువుకోవడం పూర్తిగా బందైపోయింది. నేను కాస్త గదమాయిస్తే ఏదో పుస్తకాలను ముందేసుక్కూర్చుంటున్నారు. కాని చూపులూ, మనసు మాత్రం పిచ్చుకల గూడు మీదే. పిల్లల హృదయం నిండా పిచ్చుకల ప్రపంచం వ్యాపించింది.

ఒకటి... రెండు.... మూడు- యిలా వారం రోజులు గడిచేసరికి-

పిచ్చుకలు తమ గూటిని శాశ్వత ప్రాతిపదికపైనే పూర్తి చేసుకున్నాయి. పిల్లలు పిచ్చుకాభిమానులై చదువును అశ్రద్ధ చేస్తున్నారు.

ఇప్పుడు.... ఇవాళ కూడా ఆఫీస్ నుంచి రాగానే...

ఇదిగో మళ్ళీ యిదే కథ.

"ఒరే వెధవలూ... ఎప్పుడూ ఏమిట్రా ఆ పిచ్చుకలతో... వెళ్ళి చదువుకోండి... పోండి..." అని అరిచి సైకిల్‌ను లోపలపెడ్తూ-

శ్రీమతి చేతిలో చీపురుతో వస్తోంది. వస్తూ గుమ్మంలో నన్ను చూచి "అబ్బబ్బ.ఈ పిల్లలనూ, ఈ పిచ్చులనూ నే భరించలేనండి. ఇంటి నిండా వాటితో చెత్త-వీళ్ళతో అల్లరి-కిష్కిందలో ఉన్నట్లుంది వీళ్ళతో"- అని అంటూ.... నేలపైపడ్డ గడ్డిపోచలను ఊడుస్తూ-

పిల్లల వంక చూశాను కోపంగా.

ముగ్గురూ మౌనంగా తలలు వంచుకుని పుస్తకాల్లోకి చూస్తూ చదువు నటిస్తున్నారు.

తలెత్తి వెంటిలేటర్‌లోకి చూస్తే-

పిచ్చుకలు కిచకిచా స్వచ్ఛంగా.... అమాయకంగా.... నిర్మలంగా అరుస్తున్నాయి.

లోపలికి వెళ్ళి కూర్చుని కాఫీ త్రాగుతూ-

"వీళ్ళు అసలే చదువుకోవడంలేదండీ... మీరటు వెళ్ళగానే మళ్ళీ ఆ పిచ్చుక లోకంలోకే వెళ్తారు. ఇలా వీళ్ళు నెలరోజులుంటే యిక పరీక్షలు రాసినట్టే...' అని మా ఆవిడ గొణుగుతూ-

"మరి ఆ పిచ్చుకల గూడును పీకేస్తే"

"ఊ.... అలాంటిదే ఏదో చేయాలి. లేకుంటే పిల్లలు పాడైపోయేట్టున్నారు" అంటూ వెళ్ళిపోయింది లోపలికి-

మరునాడు-

ఆఫీస్‌కు వెళ్ళొచ్చి యింకా ఆశ్చర్యపోయాను నేను నా ఎదురుగా జరుగుతున్న దాన్ని చూచి.

వెంటిలేటర్‌లోకి నిచ్చెనను వేసుకుని నా శ్రీమతి పై మెట్టుదాకా ఎక్కి గూట్లోకి తొంగిచూస్తూ.... పసిదానిలా కేరింతలు కొడ్తూ "గట్టిగా పట్టకోండ్రా నిచ్చెనను ఊం.... ఒకటీ... రెండూ.... మూడూ గుడ్లువున్నాయ్రా వీటిని పిల్లులు తినకుండా మనం కాపలా కాయాలి. అప్పుడు యివి పిల్లలౌతాయి. అప్పుడు యివి మూడు అవి రెండూ.... మొత్తం ఐదు పిచ్చుకలౌతాయన్న మాట..." అంటోంది మహానందంతో..

"అమ్మా అమ్మా... నేను చూస్తానే గుడ్లను... అమ్మా అమ్మా!" అని రెండవ వాడు మారాం చేస్తున్నాడు నిచ్చెనను పట్టుకుని,

ఇంతలో 'ఏం చేస్తున్నారూ?' అని నేనన్నమాటకు ఉలిక్కిపడి.... పిల్లలు బిలబిలా ఉరికి.... ఆమె దిగుతూ-

"అసలు నేనా గూడునే తీసేద్దామనుకుంటూంటే నువ్వు కూడా పిల్లల జట్టుచేరి ఏమిటిదిచేస్తున్నావ్" - అన్నాను ఆమెను

"పాపమలా చేయకండీ.... నోరులేని పక్షులు, ఎక్కడుంటాయి పాపం..." అంది దీనంగా. అప్పుడామె ముఖం భగవంతుడిని వరం కోసం ప్రార్థిస్తున్న భక్తురాలి ముఖంలా శూన్యంగా, అర్థింపుగా వుంది.

పిచ్చుకల అభిమానుల సంఖ్య పెరిగిందన్న మాట - నిన్నటిదాకా పిల్లలు.... ఇవ్వాళ తల్లికూడా ఆ పార్టీలోకే చేరి- .... నిట్టూర్చి

రాత్రి భోజనాల దగ్గర పిల్లలతో కాసేపు పిచ్చుకలతో ఎంతసేపు గడపవలసిందీ - ఎంత సేపు చదువుకోవలసిందీ మొదలైన విషయాలమీద నిబంధనలను తయారుచేసి చెప్పాను. తద్వారా పిచ్చుకలు మా ఇంటిలో ఓ భాగమైపోయాయి. ఆ రోజు రాత్రి పడుకునేప్పుడు పిల్లలు పిచ్చుకలు ఎలా గుడ్లు పెడ్తాయి. అవి ఎలా పిల్లలను చేస్తాయి లాంటి ఎన్నో ప్రశ్నలు వేశారు.

ఆ తర్వాత అనుకోకుండా అవసరమేర్పడి సకుటుంబంగా మా కుగ్రామం రాగులవారిపల్లెకు వెళ్ళవలసి వచ్చింది. అదెక్కడో అడవిలో వుంది. అక్కడికి వెళ్ళి ఓ వారం రోజులుండి వచ్చేప్పుడు కచ్చరంలో చూస్తునుగదా. పిల్లలు మోటబావులపై చెట్లకొమ్మలకు పిచ్చుకలు కట్టే గమ్మతయిన సోలల్లాంటి పీచుగూళ్ళను మా పాలేళ్ళతో నాకు తెలియకుండా తెప్పించి మూట కట్టుకుని వెంట పట్టుకొస్తున్నారు.

పిల్లల మెదళ్ళనిండా పిచ్చుకలు... వాటి సదుపాయాలు... అవి చెయ్యబోయే పిల్లలు... యివే ఆలోచనలు నిండిపోయేయి.

నిజం చెప్పాలంటే "తినగ తినగ వేము...." వలె ఈదో పిచ్చుకల కిచకిచలు విని నేను కూడా నాకు తెలియకుండానే వాటిని యిష్టపడుతున్నట్టనిపిస్తోంది.

ప్రయాణం చేస్తున్నంతసేపూ పిల్లలు వాళ్ళు తెస్తున్న గూళ్ళలో పిచ్చుకలు ఎలా పడుకుంటాయి. తాము చేస్తున్న ఈ ఏర్పాటుకు అవి ఎలా ఆనందిస్తాయి... యివే మాట్లాడుకుంటున్నారు.

మేము యింటికి చేరుకోగానే నా శ్రీమతి చేసిన మొట్టమొదటి పనేమిటంటే యింట్లో నుంచి నిచ్చెన తెచ్చుకుని ఎక్కి- అప్పుడు చూశాన్నేను... ఆమె మేము బయల్దేరే ముందు ఎన్ని ఏర్పాట్లు చేసిందో! పిల్లి రాకుండా ఏదో ఇనుప జాలీ అడ్డుపెట్టింది. ప్రక్కన ఓ గిన్నెలో నీళ్ళు పెట్టింది. అక్కడే నూకలను పోసింది... పిచ్చుకల కోసం.

"ఒరే ఒరే... మూడు పిల్లలైనాయిరా" ఒకటే కేరింతలు... పసిదానిలా

పిల్లలా విషయం విని చెంగున గంతులేస్తూ- ఒకటే ఆనందం... ఒకటే గెంతడం-

మొత్తం మీద ఇంటినిండా సంతోషం వెల్లి విరిసింది. పిచ్చుకల జననంతో-

తర్వాత -

తల్లి పిచ్చుక ఎక్కడి నుంచో ఆహారం తెచ్చి పిల్లలకు ముక్కుతో అందివ్వడం.... పిల్లలు "అదేమిటి నాన్నా..."అని నన్నడగడం.... నేను చెప్పడం... "మరి పిల్లలకు రెక్కలు లేవేమిటి నాన్నా" అని యింకో ప్రశ్నను వెంటనే అడగడం, నేను చెప్పడం.. మళ్ళీ మరో ప్రశ్న- చివరికి నేను విసుక్కోవడం... యిదీ జరుగుతోంది రోజూ.

పిచ్చుక పిల్లలు దినదిన ప్రవర్థమానమై.... రెక్కలు సగం మాత్రమే పెరిగి- నేలపై పరుగెత్తుతూ సందడి చేయనారంభించాయి.

ఆ రోజు సాయంకాలం--

ముగ్గురు పిల్లలు బడినుంచి ప్రోగ్రెస్ రిపోర్టు పట్టుకొచ్చారు. ఇదివరకు ముగ్గురూ తమ తమ క్లాసుల్లో మొదటి రాంకులో వచ్చేవాళ్ళు యీసారి ముగ్గురూ రెండు, మూడు రాంక్‌లలోకి జారిపోయేరు. ఆ నెలంతా పిచ్చుకల సహవాసంతో గడిపి- అవే లోకంగా ఆనందించి చివరికి దిగజారి....

కోపమొచ్చింది. బాగా తిట్టాను "ముందు చదువుకోండిరా తర్వాత ఈ పిచ్చుకలూ, పీతలూ అన్నీ. ఈ పిచ్చుకలాట మీకు కూడు పెట్టదు చక్కగా చదువుకుని బాగుపడి బ్రతకడం నేర్చుకోండి. పోండి గాడిదల్లారా..." అని ఎన్నో వినిపించి... తరిమి...

పిల్లలు ముఖాలు మాడ్చుకుని ఏడుస్తూ వెళ్ళిపోయారు.

ఇంటినిండా నిశ్శబ్దం నిండి....నడుమ పిల్ల పిచ్చుకల కిచకిచలచప్పుళ్ళు.

వాటిని వింటూంటే అదో గమ్మత్తయిన స్పందన....

మర్నాడు ఉదయమే -

సూర్యోదయం దిక్కు చూస్తూ కూర్చున్నాను కిటికీలోనుంచి.

పిల్లలు లేచి పుస్తకాలు ముందేసుకున్నారు. సరిగ్గా అప్పుడే పిచ్చుక పిల్లలు గూట్లో నుంచి నడిచి మా దగ్గరికి వచ్చేవి రోజూ.

ఆ రోజు యింకా రాలేదు.

పిల్లలు చూస్తున్నారు. దొంగతనంగా అప్పుడప్పుడు గూటిదిక్కు.

నేను కూడా చూస్తున్నాను అటు దిక్కే పిల్లలకు తెలియకుండా.

ఈలోగా రెండు పెద్ద పిచ్చుకలు రివ్వున ఎగిరిపోయేయి కిటికీలోంచి, వాటి వెంటనే వరుసగా.... ఒకదాని వెంట ఒకటీ రెక్కలొచ్చిన పిల్లపిచ్చుకలు కూడా ఆకాశంలోకి ఎగిరిపోతూ....

" నాన్నా.... పిల్లపిచ్చుక లెగిరిపోతున్నాయి" అన్నారు పిల్లలందరూ మూకుమ్మడిగా.. ఎంతోనిరాశతో...

"రెక్కలొచ్చాక ఎగిరిపోతాయి గదరా" అన్నాను.

"ఎక్కడికివెళ్ళాయి నాన్న అవి" రెండోవాడు,

" అవా.... అవీ అవి"........ ఏమని చెప్పను.

"ఆకాశంలో వాటికి బడి వుంటుందిరా..... అక్కడికి వెళ్ళాయి...." అన్నాను. చటుక్కున

"ఆకాశంలోకి ఏందిరా..... ఎలా అక్కడికి వెళ్తాయి..." అన్నాను చట్టుకున ???

"అక్కడేం చేస్తాయి అవి"

"అక్కడా.... అక్కడ వాటికి పాఠాలు చెప్తారు.... మీరు కూడా వాటిలాగానే చక్కగా బడికెళ్ళి శ్రద్ధగా చదువుకుని పైకి రావాలి"

"వాటికి ఏం పాఠాలు చేప్తారు నాన్నా అక్కడ?"

"వాటికి.... వాటికీఁ..." ఏం చెప్పాలి....?

"వాటికీ.... ఎలా ఎగరాలి..... ఎలా బ్రతకాలీ.... ఎలా ఆహారం సంపాదించుకోవాలీ... యివి- చెప్తార్రా...."

"మరి మా స్కూల్లో

ఎలా బ్రతకాలీ.....

ఎలా ఆహారం సంపాదించుకోవాలి యివి చెప్పరుగదా నాన్నా.... మేమా బడికి పోం...."

పిల్లల మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి.

జవాబు ఏది....?

లేదు.

ఆకాశంలోకి... శూన్యంలోకి చూస్తున్నాను - శూన్యంగా....

( 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ఆదివారం..)
విశాలాంధ్ర - తెలంగాణ కథ